"పేదకు దొరికిన పెన్నిధి"

మూలం :
'స్టాసీ ఔమోనియర్'

★

అనువాదం :
శ్రీ నేమాని వీరభద్రరావు

మైకేల్ జాక్, జీవితములో ధక్కాముక్కీలు తిన్నమనిషి రైలులో మూడవతరగతిపెట్టెలో ఒకమూల కూలబడి తను ఏపరిస్థితులమూలంగా అప్పటి హైన్యస్థితికి లోనుకావలసివచ్చిందో సింహావలోకనం చేసుకుంటున్నాడు. సూక్ష్మంగా చెప్పాలంటే అతని జీవిత గ్రంథంలో అప్పటికి వున్న ముఖ్యమైన శీర్షికలు తనకువున్న ముప్పై సంవత్సరముల వయస్సు - వివాహంకావటం - ఏమీ ఆర్జన లేకపోవటం- తల మునిగిన అప్పులు.

ఆక్స్‌ఫర్డులో చదువుతూవుండగా, అతనితండ్రి హృదయదౌర్బల్యంవల్ల అకస్మాత్తుగా మరణించినందున, వెంటనే చదువుకు స్వస్తిచెప్పి యింక వెనకాసరా ఎవరూ లేకపోవడంచేత, బస్తీకి పోయి ఏ వుద్యోగం లభ్యమవుతే అందులో ప్రవేశించక తప్పిందికాదు. అతని తల్లి యిదివరకే చనిపోయింది. ఏకైకసోదరి బర్మాలో ఒక మిషనరీని వివాహమాడింది. ఆ పరిస్థితులలో మైకేల్ మంచిశరీరారోగ్యము గలవాడుగను ఆటలయందు మంచి అభిరుచిగలవాడుగను, ముందు రాబోయే కష్టపరంపరను వూహింపలేనివాడుగను వుండెడివాడు.

మైకేల్ తండ్రి మంచి మేధావి. ప్రపంచానుభవం కలవాడు. ఆదర్శప్రాయుడు. అతని ఆకస్మికమరణం అనేకమంది చర్చలకు లోనై, ఇదనిమిత్తమని ఎవరిచేతను తేల్చబడలేదు మైకేల్ భావి జీవితం విషయమై ఆయన ఆలోచనలన్నీ కార్యరూపం ధరించకుండానే వుండిపోయాయి.

స్నేహితుల సహాయం మూలంగా, మైకేల్ ఒక యిన్సూరెన్సుకంపెనీలో గుమాస్తాపని సంపాదించేడు. ఆ గుమాస్తాగిరీలో దొరికే తక్కువజీతంతోనే అతనిదినం గడుపుకుంటున్నాడు. కంపెనీలలో గుమాస్తాగిరీలకు అవసరమైన, టైపు, షార్టుహేండు, ప్రతిసాయంకాలం నేర్చుకొనేవాడు. మొదటిదినాల్లో కొంత వుత్సాహంతో పనిచేయగల్గినా ఆ పని, అతనికి తగదని తెలుసుకోడానికి ఎంతోకాలం పట్టలేదు. తనతో సమానంగా నేర్చుకుంటూన్న సోదరుల లోని అభివృద్ధి తనలో కన్పట్టనప్పుడు, దానికి తగిన మేధస్సు తనకులేదని గ్రహించి, తాను ఒక వృత్తి నవలంబిస్తే ఎంత బాగుంటేదో' అని విచారించసాగేడు. యిన్సూరెన్సుఆఫీసులో గుమాస్తాగిరి మానేసి అనేకమందిదగ్గర అనేకపన్లుచేసి, కడకు యింగ్లండులో మానసికపరిస్థితి బాగులేని ఒక యువకునికి నర్సుగా ప్రవేశించాడు. దానికికూడా కొద్దికాలంలోనే స్వస్తి చెప్పి, మింటింగ్ అనే యువకునితో పరిచయం సంపాదించి, యిద్దరూ కలిసివ్యాపారం చేయనిశ్చయించి, పెట్టుబడికి కొంతసొమ్ము చేకూర్చగలిగి, ప్రారం

భించిన ఒకటి రెండు మాసాల్లోనే, లాభం సంపాదించినతరువాతగాని, మైకేల్‌కి మేఘాచ్ఛాదితమైన తన జీవితాకాశంలో మెరుపులుకూడా లేకపోలేవన్న విశ్వాసం కుదిరింది గాదు. అక్కడ వున్నప్పుడే ఒక నాటకసంస్థకు యజమానిగా యున్నతనికి, కార్యదర్శిగా .పనిచేయుచున్న, ఎలియనార్‌తో పరిచయం కలిగి, ఆ పరిచయమే, ప్రేమగా మారి, కడకు యిద్దరూ, వివాహమాడటంకూడా తటస్థించింది. ఆ మరుచటి సంవత్సరమే, వారి నిష్కళంక ప్రేమకు ఫలితంగా ఒక ఆడుబిడ్డ కలిగింది. స్నేహితులిద్దరూ, ఒక గుమాస్తానుకూడా పోషింపగలుగుతున్నారన్న విషయం, వారి వ్యాపారం అభివృద్ధిలో వుందని చెప్పక చెపుతుంది.

మూడు సంవత్సరాలు మైకేల్ జీవితం సుఖంగా దొర్లిపోయింది. జూలై నెలలో ఒక దినమున, వారి శాంతిమయజీవితసరోవరంలో అలలు బయలుదేరాయి. మైకేల్ భార్యాసహితంగా, పదిహేను దినముల క్రిందటే సముద్రయానానికి బయలుదేరాడు. ఆఫీసుకు శెలవుదినములు. వారు తిరిగివచ్చిన తరువాత, మింటెంగ్ వెళ్లుటకు నిశ్చయించారు. మైకేల్ తిరిగి వచ్చుసరికి ఆఫీసులో గుమాస్తా ఒక్కడే వున్నాడు. "మింటింగ్ కూడా, మైకేల్ బయలుదేరిన మరుచటిదినమే, ఆఫీసు విడిచి ఎక్కడికో పోయెనని గుమాస్తా చెప్పగా విని, మైకేల్ ఆశ్చర్యపోయాడు. మింటింగ్ ప్రవర్తనలలో వున్న రహస్యం తెలుసుకోడానికి ఎంతో కాలం పట్టలేదు, వారి వ్యాపారమునకు వుంచబడిన పెట్టుబడి సొమ్ము మింటింగ్, బ్యాంకులోనుండి తీసి పరారయినాడు.

మైకేల్ యీ విషయం భార్యచెవిని వేయలేదు. తాను చేయవలసిన ప్రయత్నం అంతా చేసి, కడకు నిస్పృహ చెందక తప్పిందిగాదు. తన దగ్గర వున్న కొద్దిసొమ్ముతోనూ, తీర్చవలసిన బాకీలన్నీ ఎలా తీరుస్తానో అన్న బెంగ అతన్ని సగంభాగం క్రుంగదీసింది. తాను స్వంతంగా వ్యాపారం నడపడం అసంభవంఅని, నిశ్చయించుకున్నాడు. అక్కడక్కడ నాలుగైదు పౌనులు బదులుచేసి గుమాస్తాకు యివ్వవలసిన జీతం యిచ్చి, ఆ బాధ్యతి ముందుగా వదల్చుకున్నాడు. ఈ కష్టాలన్నీ మన శాంతిని భంగంచేస్తూవుంటే అతడు మొదట పెట్టుబడికి తెచ్చిన ఏభై పౌనులు వెంటనే యియ్యవలసినదని ఒత్తిడి కలగజేసేరు. తాను స్వయంగా వెళ్లేడు. కష్టాలన్నీ ఏకరువు పెట్టేడు. ప్రార్థించేడు. కాని ఆ ఋణదాత హృదయం చెమర్చలేదు. పైగా మైకేల్ని, అసమర్థుని క్రింద జమకట్టి, యీసడించేడు.

"తాను దివాలాతీసేనన్న విషయం ఎలియనార్‌తో చెప్పక తప్పదు. సుస్వభావం కలిగిన ఆమె ఏసమాధానంయిస్తుందో అతను వూహించాడు. ఆమె అతననుకున్నట్లుగానే అంది. "తిరిగి మనరోజులు బాగుపడకపోవు. బెంగపడవద్దని ఓదార్చింది. కంపెనీలలో వుద్యోగంచెయ్యడానికి గల సమర్థత ఎలియనార్‌వద్ద వుంది. వెంటనే ఆమె కాగితం తయారుచేయు ఒక మిల్లుయజమానివద్ద కార్యదర్శిగా ప్రవేశించింది. పనిసమయంలో పిల్లని, మంచి స్వభావం గల పొరుగువారికి వప్పగించిపోతూంది. జూలై నెల ఆగష్టునెల మైకేల్ ఖాళీగానే యున్నాడు. సెప్టెంబరునెలలో మాత్రం ఒక షాపులో గుమాస్తాగా ప్రవేశించాడు. వచ్చే రాబడి చాలా తక్కువైనందున, తక్కువ అద్దెగల యింట్లో ప్రవేశించాడు. వచ్చేరాబడి చాలా తక్కువైనందున యీ దుస్థితి కలిగిందని భార్యతో చెప్పినపుడు ఆమె చిరునవ్వు నవ్వి "మనకష్టాలు డబ్బుకు సంబంధించినవైతే నేను లెఖచేసేదాన్ని కాను. ఆ దయామయుని దయవల్ల మరే కష్టాలు మనలను చుట్టుముట్టకుండా వుండాలి" అంటుంది. ఆమె అనుకున్నట్లుగానే ఒక సంవత్సరంవరకు వారి కష్టాలు ఆర్థికసంబంధమైనవిగానే వున్నాయి. తర్వాత ఎలియనార్ ఒక బిడ్డను కని ఆ బిడ్డనూ, ఆరోగ్యాన్నీ కూడా కోల్పోయింది. మైకేల్ యిదివరకు ఏభైపౌన్లు యిచ్చిన ఋణదాతవద్దకే వెళ్లక తప్పిందిగాదు. కాళ్లావేళ్లా పడి మరి పదిపౌనులు మాత్రం అప్పు తేగలిగేడు. మూడునెలలు ఎలియనార్ అనారోగ్యంచేత బాధపడి, తిరిగి పనిలో ప్రవేశింపగలిగింది. యీ మధ్య కాలం వారు పడిన కష్టాలు ఆ భగవంతునికే ఎరుక. రొట్టె పాలమీద, యిన్నాళ్లూ బ్రతకడంచేత మైకేల్ చాలా చిక్కిపోయాడు. మైకేల్ యింతవరకు ఏ అనుభవాలు జీవితంలో సంపాదించగలిగేడో, ఏ బాధలకు గురి అయ్యాడో వివరించడం విసుగుదల అయిన విషయం. చెప్పవలసిన సంగతి, మైకేల్ తిరిగి నిరుద్యోగి అయ్యాడు యిదివరకు బదులు యిచ్చిన మనిషిదగ్గరకే మరొకసారి వెళ్ళేడు. ఆవ్యక్తి మైకేల్‌కి దూరపుబంధువు కాడు. కేవలం పినతండ్రి... వడ్డీవ్యాపారం చేస్తున్నాడు. బస్తీగొడవల నుండి దూరంగా వుండి, భార్యా ధనమూ యీరెండింటిమీదను తన దృష్టిని కేంద్రీకరించి అదే ప్రపంచమని వుంటాడు. అతనేం కావలసినా అతని ధనమే చేకూరుస్తుంది.

మైకేల్ తండ్రి, పినతండ్రులమధ్య బద్ధవైరము, ఒకరంటే మరొకరికి తగని ద్వేషం. అందుచే పినతండ్రి అన్నగారితో సంబంధం. ఏనాడో త్రెంచుకొని దూరంగా వున్నాడు. అతడు తల్చుకుంటే మైకేల్ని ఒక వృత్తిలో ప్రవేశపెట్టగలిగేవాడే. కాని ఆ వుపకారం చెయ్యటం ఎంతమాత్రం యిష్టం లేదు. వచ్చినప్పుడు, ఏదో ముష్టివానికి విదిల్చినట్లు విదల్చడం, అతని తండ్రియొక్క దుర్గుణాలను ఒక్కసారి వర్ణించి, మైకేల్‌ని చిన్నబుచ్చడం జరుగుతూంది. జీవితంలో మైకేల్ యొక్క అపజయాలను చూసి పినతండ్రి సంతోషిస్తున్నాడని మైకేల్ అభిప్రాయం. ఈసారి ఎంత ప్రార్థించినా అతని మనసు కరుగలేదు. "నీబ్రతుకు నీవు చూచుకోవాలిగాని ఎంతకాలం నీకు నేను సహాయంచెయ్యగలను." అని, నిష్కర్షగా అన్న వాక్యాలు తల్చుకొని, భార్యా బిడ్డల కొరకు తాను యీ కష్టాలన్నీ అనుభవిస్తున్నానని సమాధానపర్చుకొని, ఆ రాత్రి అక్కడ గడపి, వచ్చేసమయంలో పినతండ్రి యిచ్చిన మూడు పౌనులు పట్టుకొని యింటికి వస్తున్నాడు. ఈ సింహావలోకనములో అతనికి యితరుల సంభాషణలుగాని, మరే గొడవగాని పట్టడమేలేదు. రైలువాటర్లూ స్టేషనులోనికి వచ్చింది. అతనికి గమ్యస్థానం కూడా అదే. తన సంచితీసుకొని దిగేడు. కాని చాల నీరసమనిపించింది. "భగవంతుడా నాకు జబ్బుచేయదు కదా' అనుకున్నాడు. రాత్రికట్టుకొనే దుస్తులుతప్ప ఆ సంచిలో మరేమీ లేవు. అదే పెద్దబరువనిపించి, గేటులోనుంచి వెళ్ళేటప్పుడు కళ్లుకూడా తిరిగాయి. అక్కడ ఒక బండిని చూడగానే, తాను దానిమీదపోతే బాగుండుననిపించింది. తాను ఎక్కబోయే బండిలోనుండి యిద్దరు పెద్దమనుష్యులు

(26 వ పేజీ చూడుడు)

“పేదకుదొరికిన పెన్నిధి”

(15 వ-పేజీ తరువాయి)

దిగేరు. ఆ బండే కుదుర్చుకొని అలసటతో కూర్చున్నాడు. బండిలో చాల చీకటిగా వుంది. కడుపు దహించుకుపోతూంది.

బండి మలుపు తిరగటంతో, కొంచెం కుదిపి మైకేల్ని వూపింది. మైకేల్ ఆపుకోడానికి చేతులు చాచి తన సీటు చివర భాగాన్ని పట్టుకోవలసివచ్చింది. చేతులకేదో తగిలింది. దానిని తీసి జిజ్ఞాసచే కిటికీ దగ్గరపెట్టి చూశాడు. ఎర్రతోలుతో చేయబడిన సంచి. తాళంవేయబడివుంది. యిదివరకు దిగిన పెద్దమనుష్యులదై వుంటుందని వూహించి, బండివానిని తిరిగి స్టేషనుకు బండిని త్రిప్పమని చెప్దామా, అనుకున్నాడు. కాని వారిని కలుసుకోవడం అసంభవమైన పని; తన కర్తవ్యం ఆ సంచిని పోలీసులకు వప్పగించడమే.

“అందులో ఏమున్నదో అన్న జిజ్ఞాస ఎక్కువైపోయింది. తాళం లాగాడు. కాని రాలేదది. అది తాళంవెయ్యబడకుండా వుంటే ఆ నిమిషానికే అతని జీవితంలో ఎంతో విశేషమార్పు వచ్చియుండెడిది.

మెదడంతా ఆలోచనలతో నిండిపోయింది ఒకదాన్ని మరొకటి ఓడించేస్తూంది. యించుమించు స్వప్నలోకంలో విహరిస్తున్నట్లున్నాడు. రాత్రిభోజనం ముందుచేసి, తరువాత ఏపనినైనా చెయ్యాలని, బండి హోటల్కి త్రిప్పమన్నాడు. బండికిరాయి చెల్లించి, హోటల్లోకి చురుగ్గా ప్రవేశించి ముందుగా ఒక పాయిఖానాలో ప్రవేశించి, ఆ విద్యుద్దీపకాంతి వెలుగున, అతనిజేబులో వున్న చిన్న చాకుతో, ఒకపావుగంట తంటాలుపడి సంచిని తెరవగలిగాడు. సంచిలోపల చూడగనే అతని రక్తప్రసరణ ఎక్కువయింది. గుండెలు విపరీతవేగంతో కొట్టుకుంటున్నాయి. ఒక పౌనునోట్లకట్టలు ఎనిమిదున్నాయి. అన్నీ సరికొత్తవి. ఒక్కొక్క కట్టలో 250 పౌనులున్నాయని పైన గుర్తింపబడివుంది. సూక్ష్మంగా చెప్పాలంటే ఒక్కసారిగా, ఆసమయంలో రెండు వేల పౌనుల కధికారన్నమాట.

జీవితంలో దెబ్బలు తినిన తను...భార్య, బిడ్డ...అన్నంలేక మాడటం,...నిరుద్యోగం...రెండువేల పౌనులు...నిజంగా అసమయంలో తన జీవికతుల, రెండవవేపునే బరువు సూచిస్తూంది. ఆ నోట్లలో పదిహేడు పైకి తీసి తన నోట్పుస్తకంలో వుంచాడు. మిగిలినవి తాను ధరించిన కోటుజేబుల్లో సర్దేడు. తోలుసంచికూడా ఒకదాంట్లో కుక్కేడు.

హోటల్లోపలికి వెళ్లి ఖరీదైన బ్రాందీ సోడా తెమ్మని హుకుమ్ చేశాడు. అవి త్రాగి బయటపడ్డాడు. ఒక బండి కుదిర్చేడు. యింటికి పోయేమార్గంలో సారాబుడ్లు, చాకలెట్పాకెట్లు కొన్నాడు. యింతవరకు అతని మనోభావాల్ని ఏ అంతశ్శక్తి అణిచివుంచిందోగాని, యింటి పరిసరప్రాంతాలకు వచ్చేసరికి తన భార్యా, తానుచేసినపనీ స్మృతికి వచ్చాయి.

“దొంగతనం పచ్చిదొంగతనం” కాని యింకొకరుమాత్రం ఆసమయంలో ఏమిచేసియుండెడివారు! అతనిని భయపెట్టేదేమీ లేదు. కాని ఒక్కటి...... అతని భార్యయొక్క, కాంతులను వెదజల్లే నేత్రాలు. యీవిషయం అతని భార్యకు ఎంతమాత్రం తెలియకూడదు. సంచిని వదల్చుకోవాలి. నోట్లను దాచెయ్యాలి. అప్పుడప్పుడు అవసరాన్నిబట్టి తియ్యాలి. ఏదో పనిచేసి గడించినట్లు నటించాలి. కాని సంచిని వదల్చుకోవటం ఎట్లా? బండిలో వదిలేస్తే...సమయంవస్తే బండివాడు తప్పక సాక్ష్యంయిస్తాడు. యీ విషయం ఆలోచిస్తేనేగానియింటికి పోవద్దనుకున్నాడు. బండిదిగి వానిని పంపించి నడవటం ప్రారంభించాడు. మధ్యత్రోవలో ఒక కాల్వవుంది. దానిపైన వంతెనుంది. చురుగ్గా నడుస్తున్నాడు వంతెనమీద మైకేల్. అతనిలో యిదివరకున్న శ్రమ లేదు. ఒక రాయికట్టి సంచిని కాల్వలో పారేద్దామనుకున్నాడు కాని అక్కడ రాళ్ళు లేవు. వూరికే పారేస్తే మునిగిపోదూ? కానిము లక్కపోతేమాత్రం! యీవిషయం గురించి ఎవరంతపట్టించుకొనేవారు. అదే మాసిపోతుందనుకున్నాడు.

ఒంతెనమీద ఒకరిద్దరు నడుస్తున్నారు. అందరూ పోయేవరకూ, వేచివుండాలి. సంచి చేతులోకి తీసుకున్నాడు. ఒకసారి ఎవరికీ, అనుమానం కలగకుండా వంతెన చివరవరకు నడిచేడు. అందరూ దృష్టిపథాన్నుండిపోయాక తిరిగివచ్చేడు మైకేల్. యిప్పుడు పారేస్తే......అహా(...అందుకూ వీలుపడలేదు. ఎవరో వస్తూన్నట్లున్నారు...పోలీసేమో...‘ఆవంతెనమీద ఏంచేస్తున్నా’వని అడిగితే; వంతెన మరీ బయలు ప్రదేశం అయిపోయింది. చీకటి ఆవరించుకొన్న ఒక సందులోకి మళ్లేడు మైకేల్. ఒకపిట్టగోడ, దానివెనుకభాగాన్ని చిన్నతోట వుంది. ఆమార్గంలో ఒక్క వ్యక్తికూడా కొనరాలేదు. మెరపులా గోడవతలికి విసిరేసేడు సంచిని. మైకేల్ కాని ఆతోటలో మేడమీద విద్యుద్దీపకాంతులలో ఒకవ్యక్తి యితనివైపే దృష్టి నిగిడించి చూస్తున్నాడు.

“ఎలాగైతేం, వదిలిపోయిందిగదా!” అని సంతోషపడ్డాడు. ఒక బాధవదిలింది. రెండవది ఆనోట్లు దాచడం ఎలాగ...... జేబులు యితరులకు అనుమానాన్ని రేకెత్తిస్తూ ఎత్తుగా వున్నాయి. యింటికి పోగానే ఎలియనార్ తప్పక వచ్చి కౌగలించుకుంటుంది. “మీరేం తెచ్చారు” అనే పరిచయవాక్యాలు అతని చెవుల్లో రింగుమంటున్నాయి. ఏవస్తువునైనా ఎలియనార్కి తెలియకుండా దాచటం బహుకష్టమైన పని. అతనికి సంబంధించిన ప్రతివస్తువును ఎలియనార్ ఎంతో శ్రద్ధతో చూస్తుంది. యింట్లో ఏపెట్టెకూ తాళం లేదు. యీబాధ అంతా మైకేల్, తన ప్రవర్తనకు ఆమెచే కళంకం ఆపాదింపబడేటట్లు లేకుండా పడుతున్నాడు. “ఈ నోట్లు ఎక్కడైనా దాచి యింటికి పోనా” అనుకున్నాడు. “వెర్రిపన్లు చెయ్యకు, నీకే గాకుండా నీభార్యా బిడ్డకు సౌఖ్యం చేకూరబోతుంటే ఆహ్వానించక, నిరాకరించేవ్యక్తివి నీ వొక్కడవు కనిపించావు” అని ఘోషించిందాత్మ. ఎలాగైతేనేం యిల్లు చేరుకున్నాడు.

“అదుగో, ప్రియతములు దయచేశారే, సుఖంగా వున్నట్లేనా” అని ప్రేమపూర్వకంగా ఎలియనార్ ప్రశ్నించింది :

ఓహో, అంతా సుముఖంగానే నడిచింది. ఈలోపున యానీ ఏడవటంమూలాన ఆమెను జోకొట్టిరాడానికి ఎలియనార్ లోపలికి వెళ్లింది. “సమయం దొరికింది గదా”అని మైకేల్ నోట్లకట్టలను ఒకపాట్లం క్రింద కట్టి అలమారులో పెట్టేడు. “యీ రాత్రికి యింతకన్న నేనేమీ చెయ్యదల్చుకోలేదు. చెయ్యలేను” అని సమాధానపడ్డాడు. ఎలియనార్ వచ్చినతరువాత “చాలా అలిసిపోయా”నని చెప్పి భయముచే బిడ్డనీ, తల్లినీ కౌగలించుకున్నట్లుగా, యిన్ని

దినాల వియోగంచేత మైకేల్ ఆమెను ఆలింగనం చేసుకున్నాడు.

ఆమె ప్రశాంతంగా నిద్రపోయినతరువాతగాని తోలుసంచికి సంబంధించిన ఆలోచనలు అతనికి రాలేదు. అతనుగనక పట్టుబడితే, ఆమె తప్పక గుండెపగిలి చనిపోతుంది. "ధనానికి సంబంధించిన కష్టములు నాకు లెఖలేదు. మరేవిధమైనవి చుట్టు ముట్టకుండా వుండాలన్న" ఆమె వాక్యాలు అతనికి జ్ఞాపకం వచ్చేయి.

అతను చేసినపని ముమ్మాటికి అన్యాయం. పచ్చిదొంగతనం, పట్టుబడితే అరెస్టు, విచారణ, ఖైదు, తప్పవు. యిదివరకు ఎన్నడూ ఎవ్వరికి అన్యాయం చెయ్యలేదు. ఎవరి దృష్టిలోనూ, నేరస్థునివలె వుండలేదు. "ఈ సంగతి యలియనార్‌కి తెలిస్తే," ఆమె యింక ఎంతమాత్రము యిదివరకువలె ప్రేమించలేదు. ఆమెజీవితము భ్రష్టవుతుంది. చిన్నబిడ్డభావిజీవితం మంట కలుస్తుంది.

రెండవ గదిలోకి వెళ్లి నోట్లు తగలబెట్టేస్తే! "అమ్మో, కాల్చెయ్యడమే. ఎలియనార్‌కి గాఢనిద్ర పట్టను. బాలిక, కదిలితే చాలు లేస్తుంది తాను లేచి అంత ప్రయత్నం చేస్తూంటే లేవదూ? తప్పక మేల్కొంటుంది. యింతకూ తోలుసంచి విసిరేసేడుగద. తిరిగి వట్టినోట్లకట్టలిస్తే, అతను సంజాయిషీ యివ్వవలసిన విషయాలు చాలా వున్నాయి. "వెర్రివాడా, అంత సొమ్ము నీదగ్గర వుందా? నీవు .అందులో కొంతభాగం ఖర్చుచేయలేదూ?"అని ఆత్మ ఘట్టిగా ప్రశ్నించింది. "బహుశా ఆ ధనం ఒక పెద్ద కంపెనీకి చెందివుంటుంది. బీదవాళ్ల కూటిలో మన్నుకొట్టలేదుకద." ఆ సంగతి అతని మనసుకు శాంతినే చేకూర్చింది. కాని నిద్రపట్టక దొర్లుతున్నాడు మైకేల్ యీ ఆలోచనలతో. సొమ్ము అతనిదగ్గర వుంచితే, ఏవో మాయకబుర్లు చెప్పాలి. ఏదో పెద్దవుద్యోగం దొరికిందంటే; అహః. ఆ విషయం ఎలియనార్ నమ్మదు. అతనివద్ద ఏ వుద్యోగానికి సమర్థత వుందో ఎలియనార్‌కి తెలుసు. పినతండ్రి యిచ్చేడంటే... ఆ విషయంకూడా ఒకానొకప్పుడు ప్రమాదంచేదే; ఎలియనార్, పినతండ్రికి వ్రాసి కనుక్కొందామన్న యిచ్ఛ కలిగి వ్రాస్తే, అతడు వ్యతిరేకసమాధానం యిస్తే, తన మాటలు నూటికి నూరుపాళ్లూ అసత్యమని తేలుతుంది.

"ఈ ఆలోచనలన్నీ ఎందుకు, ఖర్మ ఎలా వ్రాసివుంటే ఆ విధంగా .అవక మానదు"అని నిద్రపోయాడు మైకేల్.

"చాలా అలిసిపోయినట్లున్నారు. . యింత ప్రొద్దుపోయినా లేవటంలేదు" అన్న ఎలియనార్ స్వగతంవల్ల అతనికి మెలుకువ వచ్చింది. కాలకృత్యాలన్నీ తీర్చుకుంటున్నాడేగాని, నోట్లవిషయమైన ఆలోచనలతో మెదడు కందిపోతూంది. నోట్లకట్ట బీరువాలోనుంచి తీసుకొని లైబ్రరీకని పోదామనుకున్నాడేగాని, ఎలియనార్ ఎప్పుడూ కూడానే వుంటూంది. కడకు వెళ్లిపోయేటప్పుడు కూడా "త్వరగా వస్తారుగదూ"అంటూ గుమ్మందాకా వచ్చింది.

ఎలియనార్ ఒక గొప్పవాణ్ణి వివాహమాడివుంటే, ఆమె సౌందర్యం, ,తెలివితేటలు, జాగ్రత్త, ఎంతైనా సార్థకములోనికి వచ్చును.దగ్గరగా వున్న పేపర్ల దుకాణానికి పోయి ఒక పత్రిక కొన్నాడు మైకేల్. అందులో సంచికి సంబంధించిన వార్తలేమీ లేవు. ఏమో, యీ పత్రికలో ఆ వార్త వెయ్యడానికి టైము లేదేమో!" అనుకున్నాడు. యింతలో మరియొక పత్రిక వస్తే కొన్నాడు. అందులో మొదటి పేజీలోనే పెద్దఅక్షరములతో "బండిలో 2000/- పౌనులు వదలివేయబడెను" అన్న వార్త వుండెను. ఒక బ్యాంకిషరాఫ్, సర్ జేమ్సు కుస్పింగ్ కె. బి. యి. అను వతనిచే మరచిపోబడెనట. బ్యాంకికి సంబంధించిన సొమ్మట. ఆ సంగతి విశదపర్చినవారికి బహుమానముకూడ యిత్తురట.

ఇంతవరకు వచ్చిన వార్తలు తృప్తికరంగానే వున్నాయి కుస్పింగ్ లక్షాధికారి. తన అజాగ్రత్తకు బ్యాంకువారు సొమ్ము వసూలుచేయ నిశ్చయించినను యియ్యగల సమర్థుడు. బ్యాంకి దీనివలన పెద్దనష్టానికి లోబడుతుందా, అంటే కోట్లమీద వ్యాపారంచేస్తూన్న సంస్థ. రెండు పెన్నీలెంత విలువ మైకేల్ దృష్టిలోవుందో, బ్యాంకుకు రెండువేల పౌనులంత విలువ. అయిపోయిందేదో అయిపోయింది. దానికోసం యింత, తలబ్రద్దలు చేసుకోవడం ఎందుకు మైకేల్.

మైకేల్ తిరిగి యింటికి వచ్చేడు: అప్పుడే ఎలియనార్, అలమారులో నోట్ల పొట్లం చూసింది. "ఈ పొట్లం ఏమిటి" అంటూ ప్రశ్నించింది మైకేల్ని.

ఓ...అదా...అవును...నాది.. కాదు. ఎవరిదో యితరులది.

ఎలియనార్ మైకేల్‌లమధ్య రహస్యాలింతవరకు లేవు. "నేను యీ పొట్లం విప్పలేదులెండి"అని అమాయకంగా ఎలియనార్ అతని చేతిలో వుంచింది.

"అయ్యో దీనిసంగతి మర్చిపోయాను. వెంటనే యిచ్చిరావాలి అని కోటు తీసుకొని, పొట్లం చేత్తోపట్టుకొని వీధిలో అడుగుపెట్టేసరికి ముఖంఅంతా చెమటతో నిండిపోయింది. ఒక్క అరగంటలో ఒక మారుమూలసందులో ఒక యింటాముదగ్గరకు వచ్చేడు మైకేల్.

"అమ్మా, యిక్కడ అద్దె కియ్యడానికి వీలుపడుతుందా; ఒక్కగదిమాత్రం కావాలి" అన్నాడు.

"ఓ తప్పక యిస్తాను" అందామె.

"మరేమీ లేదు. నేను ఒక కవిని. నిశ్శబ్దంగా వ్రాసుకునేందుకు ఒక మంచి గది కోసం తిరుగుతున్నాను."

"నీకు సరిపడేగది యిస్తాను. రా"అంది. మైకేల్ గది చూశాడు. మురికితో, చీకటిగా వుంది.

"సరే, యీ దినమే వస్తాను"అన్నాడు మైకేల్.

"మీ పేరు?" అంది ముసలిది.

"నా పేరా.........జాన్ పార్సన్సు" అన్నాడు మైకేల్. బజారుకు పోయి గట్టి తాళం ఒకటి మంచి సొరుగుపెట్టె, కాగితాలు, కలము, సిరా మొదలగునవన్నీ కొని తీసుకువచ్చి వాటితోబాటు నోట్లకట్టలు కూడా అందులో పెట్టి తాళమువేసి తన గదికికూడ తాళం బిగించి తిరిగి వీధిలో పడ్డాడు. ఒక్కసారిగా స్వేచ్ఛ ననుభవించగలేడు. తనకు విసిరే గాలి అప్పుడు చల్లగా వుందని అనగలిగేడు.

మైకేల్ యింటికి వచ్చేడు. ఎలియనార్‌కి అనుమానం తోచకుండా, ఎవరో స్నేహితుడు ఆ పొట్లం ఒకరికి అందచేయవలసినదని

గనోక్యూర్
ఉష్ణ పెరంతు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మశీ రాజమండ్రి

ప్రార్థించేడని, ఎలియనార్ తిరిగి యిచ్చేవరకు, తనకు ఆవిషయముజ్ఞాపకమే లేదని, తను యిచ్చివచ్చినందున బాధ్యత వదిలిందని కల్పితకథ చెప్పి ఆమెకు నమ్మకం కలుగచేశాడు.

ప్రతిదినం తన గదికి వచ్చి నోట్లు చూసుకొని కావలసినవి తీసుకొని తిరిగి వస్తున్నాడు. ఎలియనార్‌తో తనకు క్రొత్త వుద్యోగం వచ్చిందని, వారానికి అయిదు పౌనుల జీతమని చెప్పేడు. ఎలియనార్ ఆనందం పట్టలేకపోయింది.

"యింతకూ నాయందు తప్ప "బిన్స్" కంపెనీవారికి నమ్మకం లేక యీ వుద్యోగం నా కిచ్చారు. పని చాలా తేలికనికూడా చెప్పాడు.

తన భార్య, బిడ్డ సుఖంగా బ్రతుకుతున్నారు. యింతకన్న మైకేల్‌కి కావలసిన దేముంది.

ఆర్థికంగా అతనిస్థితి బాగున్నా నైతికంగా చాలా హీనుడైపోయాడు. నిరంతరం అసత్యం పల్కడం, అనుమానం, భార్య ముఖంలోకి చూడలేనంత పిరికితనం, ఆనందంగా వుండవలసిన సమయాల్లోకూడా ఒక విధమైన భయం, బెరుగు అతన్ని తరుముతో వున్నట్లే వుంటాయి. ఆలోచనలతో మెదడు కందిపోయినపుడు ఒక సారి వీధిలోకిపోయి, సారాయిపట్టించి, అసంగతులు మరిచిపో ప్రయత్నిస్తాడు.

అతనిముఖంలో ఏవో విప్పి చెప్పజాలని విషాదరేఖలు ఎలియనార్ గుర్తించక పోలేదు. ఒకదినం "మీరు ఎక్కువ పనిపైన వేసుకుంటున్నారు. రోజురోజుకు ముఖం వాడిపోతూంది" అంది ఎలియనార్. సారం వేసినప్పుడు వలవల ఏడ్చేది. అప్పుడప్పుడు తను అద్దెకు తీసుకున్న గదిలో కూర్చుని ఏదో వ్రాసి ప్రచురణకు యిస్తూ వుండేవాడు. మిగిలిన కాలం అంతా, త్రాగుడు పేకాటలలో గడిపేసేవాడు.

ఎలియనార్‌ని తన ప్రేమకు దూరంగా చేస్తున్నాడు మైకేల్. ఆరు నెలల కాలంలో సుమారు అయిదు వందల పౌనులు ఖర్చుచేశాడు. యీ వరుసను ఖర్చుచేస్తే యిక పదేనిమిది మాసాలలో అంత సొమ్మూ ఖర్చయిపోతుంది. యింక మిగిలేదేమిటి...భ్రష్టయిన జీవితం గల తను...ఆరోగ్యం చెడిన భార్య...భావి జీవితము కూడా పాడవనున్న బిడ్డ.

ఒకదినం ఎలియనార్ అద్దంలోచూసి తల దువ్వుకుంటూంటే మైకేల్ చూశాడు. ఆమె ముసలిదైనదానివలె కనబడింది. అతని ముఖం మాసుకున్నాడు. రేగినజుట్టు, గుంటలు పడిన కళ్లు, లోపలికి పోయిన దవడలు... ఒక్కసారి అతనికి దుఃఖం పొర్లుకొచ్చింది. అతని ముఖం తలగడలో దూర్చేసుకున్నాడు. ఆలోచించి కృతనిశ్చయుడయ్యాడు. సగం తినడానికి కలిగి ఒక గుమాస్తాపనే తను చేయ సంకల్పించేడు. మిగిలిన సొమ్ము ఎవరు పంపేరో తెలియకుండా, అసలువారికి అందజేదాం అనుకున్నాడు. వీధిలోనికి పోయి తిరిగివచ్చుసరికి ఎలియనార్ ఒక టెలిగ్రాం యిచ్చింది. "వెంటనే రమ్మనమని". అతని పినతండ్రి దగ్గరనుండి వచ్చింది. ఏదో ముఖ్యావసరం వుంటేగాని తంతి నిచ్చే అవుసరం వుండదు; వెళ్లమని ఎలియనార్ మైకేల్ని బలవంత పెట్టింది.

వెంటనే బయలుదేరాడు. పినతండ్రి యిల్లు చేరగానే "అతడు మైకేల్‌కొరకై ఏక, కలవరిస్తున్నాడని, చాల జబ్బుస్థితిలో వున్నాడని మైకేల్ వస్తేనేగాని ప్రాణం పోదటని దాసీవల్ల విన్నాడు.

మైకేల్ పినతండ్రి జబ్బుతో ప్రక్కనంటిపెట్టుకున్నాడు. కళ్లలోని కాంతి తప్ప మరేమీ గుర్తింప సర్వత లేనట్లుగా వుంది.

అతని పరిస్థితి త్వరగా రమ్మని అతని సైగవల్ల, మైకేల్ అతనివద్దకి వెళ్లేడు.

అస్పష్టమైన ధ్వనితో "బాబా...... పార్సిలు.......నీది..........యిరవై ఎనిమిది వేల పౌనులు నీవి...చెప్పలేను...నాకు... శలవు...అతన్ని నేనే...చంపేను.

"ఏమిటి మా తండ్రినా?" అన్నాడు మైకేల్. అవును. మీతల్లిని ప్రేమించాను...

"భగవంతుడు నన్ను క్షమించుగాక"అని ముసలివాడు చనిపోయాడు.

యిరవై ఎనిమిదివేల పౌనులతో మైకేల్ యింటికి వచ్చేడు.........

కాదు యిరవై ఆరువేలే. తాను యింక భయపడనవసరం లేదు. యింటిదగ్గర ఒక కంపెనీయజమానిదగ్గరనుండి వచ్చిన వుత్తరం వుంది టేబిల్ మీద.

"జాక్ పార్సన్సు" పేర వ్రాయబడి వుంది. యింటినంబరునుబట్టి, తన యింటికే యివ్వబడింది. అతను వ్రాసిన చిన్ననవల చాలా బాగుందని, ఆఫీసునకు ఒకసారివస్తే మేనేజరు చాలా సంతసించగలనని వ్రాయబడివుంది.

మైకేల్ ముందు ఏపనిచెయ్యాలో ఏర్పడినందుకు చాలా సంతసించాడు. ఎలియనార్‌తో పినతండ్రి యిచ్చిన ధనంగురించి చెప్పాడు. ఎలియనార్‌కి అకస్మాత్తుగా వచ్చిన సంపదను చూచిన ఆశ్చర్యంకన్న, భర్త "పార్సన్సు" అని పేరు ఎందుకు మార్చుకున్నాడో అన్న అనుమానం హెచ్చి, అతన్ని ఖండితంగా అడిగింది.

నిర్మలమైన అర్ధరాత్రిసమయంలో ఆమెకు, జరిగినవిషయమంతా తెలియజేసేడు మైకేల్. ఆమెకళ్లనుండి అశ్రువులు అప్రయత్నంగా రాలాయి.

రెండువేలపౌనులు ఒక పార్సిల్‌గా కట్టి "సర్ జేమ్సు, కుస్సింగ్. క. బి. యి అని ఆమె స్వయంగా దానిపై వ్రాసి "బండిలో దొరికిన సొమ్ము" అని ఒక చిన్న కాగితం మీద వ్రాసి, పైచిరునామావారికి పంపి, ఆ దంపతులు శాంతిని పొందేరు.

తెలుగు మెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రి,

తెలుగుదనము, తెలుగు సంప్రదాయాలు తెలుగుభాష అవతరించిన విధము. తెలుగు తేటదనము, తెలుగుకవితాపారమ్యము శాస్త్రి గారి పాతిక ముప్పయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించి యున్నది. వెల రు. 2/- తపాలాఖర్చులు 0-7-0.

శ్రీ మద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము : వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

సంస్కృత మూలము. శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు వ్రాసిన తెలుగు టీకా తాత్పర్య విశేషార్థ వివరణలుగల 400 పుటల గ్రంథము. గీతాధ్యయనము చేయువారికి మిక్కిలి ఉపయుక్తమైనది. ఖద్దరు బైండు.

ఆంధ్ర గ్రంథమాల,

తపాలాపెట్టె 212, మద్రాసు.